పింఛన్ భరోసా

రాష్ట్ర ప్రభుత్వం అర్హతే ప్రమాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తోంది. తాజాగా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి అధికారులు సర్వే నిర్వహించారు. అర్హత ఉండి చిన్నచిన్న కారణాలు, సాంకేతిక సమస్యలతో పథకాలు అందని వారిని గుర్తించారు. అలా గుర్తించిన వారిలో పింఛన్లకు అర్హులైన వారికి ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేయడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



- ఇతని పేరు పేరం మాలకొండయ్య. వరికుంటపాడు మండలం గణేశ్వరపురం. ఇతను పింఛన్ పొందే అర్హత ఉన్నప్పటికీ తన కుటుంబ వివరాల్లో ఇన్‌కం ట్యాక్స్ చెల్లిస్తున్నట్లు నమోదైంది. కేవలం సాంకేతిక సమస్యతో పింఛన్ అందని నేపథ్యంలో సచివాలయ సిబ్బంది ఆ సమస్యను పరిష్కరించగా ప్రభుత్వం ఈ నెలలో కొత్త పింఛన్ మంజూరు చేసింది. దీంతో వెల్ఫేర్ అసిస్టెంట్ రాకేష్ సచివాలయం వద్ద ఆయనకు పింఛన్ అందజేశారు.

- అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు
- ఉదయగిరి నియోజకవర్గంలో 2,043, ఆత్మకూరు నియోజకవర్గంలో 1,810 కొత్త పింఛన్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



వింజమూరు సచివాలయం-5లో కొత్తగా పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు

ఉదయగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇటీవల అధికారులు ఇంటింటికీ వెళ్లి అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించారు. వలంటీర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఉదయగిరి నియోజకవర్గ వ్యాప్తంగా పక్కా ప్రణాళికతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సభలు నిర్వహించి అక్కడికక్కడే లబ్ధిదారులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అలాగే నియోజకవర్గంలో పింఛన్లకు అర్హులైన వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు, ప్రత్యేక అవసరాలు కలిగిన వారితోపాటు వివిధ వృత్తులు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారిని గుర్తించగా వారికి ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేసింది. తద్వారా ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో మొత్తం 2,043 కొత్త పింఛన్లు మంజూరు చేయడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు అందజేస్తున్నారు.

2,043 మందికి కొత్త పింఛన్లు



అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇటవల జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా చిన్న చిన్న సాంకేతిక సమస్యలు పరిష్కరించి లబ్ధిదారులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అలాగే ఉదయగిరి నియోజకవర్గంలో 2,043 మందికి ప్రభుత్వం కొత్తగా పింఛన్లు మంజూరు చేసింది.

– మేకపాటి రాజారెడ్డి, వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త

పారదర్శకంగా పింఛన్ల మంజూరు



ఆత్మకూరు: పింఛన్ మంజూరు పత్రాన్ని లబ్ధిదారుకు అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి (ఫైల్)

ఆత్మకూరు: అర్హతే ప్రమాణికంగా లబ్ధిదారులను గుర్తించి సంక్షేమ పథకాలను అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొత్త పింఛన్లు మంజూరు చేసింది. అందులో భాగంగా ఆత్మకూరు నియోజకవర్గంలో 1,810 పింఛన్లు కొత్తగా మంజూరయ్యాయి. నూతన పింఛన్లతో కలిపి మొత్తం నియోజకవర్గంలో 38,703 సామాజిక పింఛన్ల పంపిణీ జరుగుతోంది. స్థానిక ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చొరవతో 1,810 పింఛన్లు నూతనంగా మంజూరయ్యాయి. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, డప్పు కళాకారులు, మత్స్యకారులు, ఒంటరి మహిళలు తదితర కేటగిరీల్లో ప్రభుత్వం సామాజిక పింఛన్లు మంజూరు చేస్తోంది. కాగా ఆత్మకూరు మున్సిపాలిటీలో 177 మందికి, ఆత్మకూరు మండలంలో 193 మందికి, ఏఎస్‌పేట మండలంలో 251 మందికి, అనంతసాగరం మండలంలో 304 మందికి, చేజర్ల మండలంలో 231 మందికి, మర్రిపాడు మండలంలో 340 మందికి, సంగం మండలంలో 314 మందికి సామాజిక పింఛన్లు కొత్తగా మంజూరయ్యాయి. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి పింఛన్లు అందజేస్తుండడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

వెన్నవాడలో వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ అనూషాకుమారి

ఆత్మకూరురూరల్: మండలంలోని వెన్నవాడ సచివాలయం వద్ద గురువారం మహిమలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అనూషకుమారి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది 104 వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 70 మందికి షుగర్, బీపీ తదితర పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు సైదా, అరుణ, అనురాధ, కృష్ణారెడ్డి, ఆశా కార్యకర్త వెన్నెల పద్మజ, ఫార్మాసిస్ట్ వేణు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేత



సుబ్బరాయుడికి పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ తిరుమల

జలదంకి: మండలంలోని వేములపాడు గ్రామంలో చేవూరు సుబ్బరాయుడు అనే వ్యక్తికి నూతనంగా డప్పు కళాకారుడి ఫించన్ మంజూరైంది. అయితే సుబ్బరాయుడు తిరుపతిలోని స్విమ్స్ హాస్పిటల్‌లో గుండె ఆపరేషన్ చేయించుకుని అక్కడే చికిత్స పొందుతున్నాడు. వలంటీర్ పోతల తిరుమల ఆయన పరిస్థితిని తెలుసుకుని గురువారం తిరుపతికి వెళ్లి పింఛన్ నగదును అందజేశారు.

మౌలిక వసతుల పరిశీలన



ఆత్మకూరు: ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనలతో వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ జె.ప్రణీత్ ఆధ్వర్యంలో ఆత్మకూరు పట్టణంలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీలో మౌలిక వసతులను గురువారం పరిశీలించారు. అలాగే మండలంలోని పలు పీహెచ్‌సీలను త్వరలో సందర్శించనున్నట్లు డాక్టర్ ప్రణీత్ తెలిపారు.

చవితి వేడుకలకు అనుమతులు తప్పనిసరి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): వినాయకచవితి వేడుకలకు నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతులు తీసుకోవాలని మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. మర్రిపాడు పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ మర్రిపాడు పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని, వినాయకచవితి ఉత్సవాల నిర్వాహకులు, మండపాలు ఏర్పాటు చేసేవారు పోలీసుల అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

చేజర్ల(సోమశిల): వినాయకుని మండపాల ఏర్పాటు, ఉత్సవాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని అనంతసాగరం, సోమశిల ఎస్సైలు సంతోష్‌కుమార్‌రెడ్డి, భోజ్యానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

జలదంకి: వినాయకచవితి వేడుకలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని జలదంకి ఎస్సై పి.ఆదిలక్ష్మి గురువారం తెలిపారు. గ్రామాల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేసుకునే ఉత్సవాల నిర్వాహకులు ఉత్సవ కమిటీ వివరాలతో పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు అందజేయాలని తెలిపారు.

కలిగిరి: గ్రామాల్లో వినాయకుని విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసుల అనుమతులు పొందాలని ఎస్సై ఎం.సూర్యప్రకాష్ రెడ్డి గురువారం తెలిపారు. గ్రామాల్లో ఉత్సవాల సందర్భంగా ఎలాంటి సమస్యలు తలెత్తినా 9440700098 ఫోన్‌నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

వరికుంటపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 18న వినాయకచవితి సందర్భంగా నిర్వహించే గణేష్ ఉత్సవాల నిర్వహణకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్సై విజయ్‌శ్రీనివాస్ గురువారం తెలిపారు.

కేంద్ర మంత్రిని కలిసిన విక్రమ్‌రెడ్డి, రాజారెడ్డి



హైదారాబాదులో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో మాట్లాడుతున్న మేకపాటి రాజారెడ్డి, విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్/ఉదయగిరి: కేంద్ర పర్యాటకశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజవకర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి గురువారం హైదరాబాదులో కలిసి ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని పలు పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని సంగం మండలంలో రూ.979.13 లక్షలకు, అనుమసముద్రంపేట మండలంలో రూ.507.24 లక్షలకు, చేజర్ల మండలం కోటితీర్థం ప్రాచీన ఆలయ అభివృద్ధికి రూ.323.37 లక్షలకు, ఆత్మకూరు పట్టణంలో ట్యాంక్ బండ్ అభివృద్ధి, పార్కు ఏర్పాటుతో సహా వివిధ పనులకు రూ.800 లక్షలకు, అనంతసాగరం మండలం సోమశిల ప్రాంతంలోని ఆలయాల సముదాయాలు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి రూ.1,000 లక్షలు, మొత్తం రూ.6,384 లక్షలు కేటాయించాలని ప్రాతిపాదనలు అందించారు. ఉదయగిరి నియోజకవర్గంలో దుర్గం, కృష్ణమందిరం, రంగనాయకులగుడి పునరుద్ధరణ పనులతోపాటు చారిత్రాత్మక ఉదయగిరి దుర్గంపైకి రోప్‌వే నిర్మాణానికి, కట్టడాల పునరుద్ధరణకు రూ.50 కోట్లు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరగా వెంటనే ఢిల్లీలోని అధికారులతో ఫోన్‌లో మాట్లాడి నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఇతర ప్రతిపాదనలపై కూడా సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

టీడీపీ హయాంలో నిధుల దుర్వినియోగం

- ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చేజర్ల : గత టీడీపీ ప్రభుత్వంలో కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగం అయ్యాయని, దారి మళ్లిన నిధులపై రాష్ట్ర ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటోందని చేజర్ల ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. గురువారం చేజర్లలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తప్పు చేశారు కనుకనే అరెస్ట్ అయి రిమాండ్‌కు వెళ్లారని అన్నారు. అడ్డదారిన నిధులు మళ్లించడంతోనే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. కంచే చేను మేస్తే అన్న చందంగా సాక్షాత్తు అప్పటి ముఖ్యమంత్రి అయిన చంద్రబాబే ప్రజల సొత్తును దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరలా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని తెలిపారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు పోలంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పీర్ల పార్థసారథి, మండల జేసీఎస్ కోఆర్డినేటర్ పూనూరు బాలగంగాధర్‌రెడ్డి, సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గడువు లోపు సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ హరినారాయణన్



అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

కావలి: ప్రజలు అందించిన అర్జీలకు సంబంధించిన సమస్యలను నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. దగదర్తిలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్, జిల్లాస్థాయి అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సమస్యలను సావధానంగా వింటూ వారికి పరిష్కార మార్గం చూపుతూ అర్జీలను సంబంధిత అధికారులకు అందజేసి నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశాలిచ్చారు. నిర్ణీత గడువు లోపు పరిష్కారం కాకపోతే తనకు తెలియజేయాలని అర్జీదారులకు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ శీనానాయక్, జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి, డీపీఓ సుస్మితా రెడ్డి, డ్వామా పీడీ వెంకట్రావు, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఏడీ సర్వే హనుమాన్ ప్రసాద్, పీడీఐసీడీఎస్ హేనా సుజన్, డీఎస్పీ శివాజీ, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీఈఓ గంగాభవాని, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, సీపీఓ ఏఎస్ రాజు, ఇండస్ట్రీస్ జీఎం సుధాకర్, హౌసింగ్ పీడీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై ఫిర్యాదు

ఉదయగిరి: పట్టణంలోని ఉదయగిరి-కావలి రోడ్డు మార్గంలో ఎస్టీకాలనీ వద్ద సర్వేనంబర్ 1282-4లో 1.88 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమించి వివిధ కట్టడాలు నిర్మిస్తున్నారని స్థానికులు గురువారం నెల్లూరులో కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ ఆ భూమిని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు తెలిపారు. విలువైన భూమిని పరిరక్షించి పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

మట్టి అక్రమ తరలింపు అడ్డగింత

ఉదయగిరి: మండలంలోని గడ్డవారిపల్లి చెరువు నుంచి గన్నేపల్లికి ట్రాక్టర్లతో అక్రమంగా మట్టి తరలిస్తుండగా ఇరిగేషన్ శాఖ అధికారులు చంద్రమౌళి, వేణు, సురేష్ గురువారం అడ్డుకున్నారు. చెరువు వద్ద మట్టిని తవ్వుతున్న వ్యక్తులు ఈ విషయం తెలుసుకుని వాహనాలు, ప్రొక్లెయిన్, ట్రాక్టర్లతో పరారయ్యారు. అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు.

ఓటరు జాబితా సవరణపై ప్రత్యేక దృష్టి

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గంలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ సజావుగా సాగేలా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆ నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేకాధికారి సువర్ణమ్మ సూచించారు. ఉదయగిరిలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆమె వివిధ మండలాల ఏఈఆర్వోలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఒకే కుటుంబ సభ్యుల ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇంటింటి సర్వేలో గుర్తించిన, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే పరిష్కారించాలని తెలిపారు.

ఉచిత నైపుణ్య శిక్షణ

ఆత్మకూరు: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆత్మకూరు ప్రభుత్వ పాలటెక్నిక్ కళాశాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు ఉచిత నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వెంకటరమణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ 18 నుంచి 35 సంవత్సరాల లోపు వారికి మూడు నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని, ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 91827 99405, 94912 84199 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

వరిలో తెగుళ్ల నివారణపై అవగాహన

చేజర్ల: వరిలో తెగుళ్లపై వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. గురువారం చేజర్ల మండలం మడపల్లి రైతుభరోసా కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వరిలో చీడపీడలపై కొందరు రైతులు అడిగిన ప్రశ్నలకు శాస్త్రవేత్తలు పరమశివ, మధుసూదన్ సమాధానం ఇచ్చారు. జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివన్నారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంట కోత దశలో ఉందని తెలిపారు. రాబోయే రబీ సీజన్‌లో రైతులు పాటించాల్సిన పద్ధతులను వివరించారు. అక్కడి వరి పొలాలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ లక్ష్మీమాధవి, పొదలకూరు ఏడీఏ శివనాయక్, ఏఓ శశిధర్, మడపల్లి ఎంపీటీసీ సభ్యురాలు భారతమ్మ, జేసీఎస్ మండల కన్వీనర్ పి.గంగాధర్‌రెడ్డి, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ రిలే దీక్షలు

ఆత్మకూరు: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అరెస్ట్ అయి రిమాండ్‌కు వెళ్లిన నేపథ్యంలో ఆ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు గురువారం ఆ పార్టీ నాయకులు ఆత్మకూరులో రిలే దీక్షలను ప్రారంభించారు. మున్సిపల్ బస్టాండ్ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రిలే దీక్షలు ప్రారంభించేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధం కాగా బహిరంగ ప్రాంతాల్లో దీక్షలు చేసేందుకు అనుమతిలేదని, ఎస్పీ ఆదేశాల మేరకు 144 సెక్షన్ అమలులో ఉందని ఆత్మకూరు ఎస్సై ఎం.ముత్యాలరావు తెలుపగా ఆ పార్టీ ద్వితీయశ్రేణి నాయకులు వాదనకు దిగారు. కొద్దిసేపు వాదనలు కొనసాగిన అనంతరం ప్రజలకు ఇబ్బంది లేకుండా శిబిరాన్ని రోడ్డుకు కొంత దూరం జరిపి ఏర్పాటు చేసుకొనేలా ఒప్పించారు. వైఎస్సార్‌సీపీ బహిష్కృత ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు ఇంజినీర్స్ డే

ఆత్మకూరు: ప్రముఖ ఇంజినీర్ డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య పుట్టినరోజును పురస్కరించుకుని శుక్రవారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఆంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీర్స్ డే నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ఆ కళాశాల నిర్వాహకులు, ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు గురువారం తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



సంగం: విద్యార్థులకు ప్లేట్లు అందజేస్తున్న మంజూషాదేవి

సంగం: మండలంలోని తరుణవాయి పాఠశాలలో గురువారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు హిందీ భాష గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. ప్రధానోపాధ్యాయురాలు మంజూషాదేవి తన సొంత నిధులతో 200 మంది విద్యార్థినీ, విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో గురువారం హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. 120 మంది హిందీ కవుల చిత్రపటాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శైలజాకుమారి, వైస్ ప్రిన్సిపల్ నాగలలిత తదితరులు పాల్గొన్నారు. అలాగే అనంతసాగరంలోని జెడ్పీ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు.

అనుమసముద్రంపేట: నెహ్రూ యువ కేంద్రం నెల్లూరు వారి ఆధ్వర్యంలో హిందీ భాషా దినోత్సవాన్ని బుధవారం ఏఎస్‌పేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ జ్యోతి, హెడ్స్ సంస్థ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.